సాక్షి రంగారెడ్డి

సోమవారం : 30 : సెప్టెంబర్ : 2024



ఉత్సవాలకు సర్వం సిద్ధం

భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్న మైసిగండి మైసమ్మ ఆలయం శరన్నవ రాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. 8లో ▸



దాడులు అనాగరికం

దివ్యాంగులపై దాడులు చేస్తే సహించేదిలేదని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య హెచ్చరించారు. 8లో ▸



బ్లూబగ్ మాయ!

బ్లూ టూత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు దీన్నే అస్త్రంగా మలుచుకుంటున్నారు. 8లో ▸

‘ఫ్యూచర్’కు మెట్రో!

రెండో దశతో విస్తరించనున్న సేవలు

- నగర శివార్ల వరకు రైలు పరుగులు
- ఫ్యూచర్‌సిటీకి మహర్దశ
- రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన ఫోర్త్‌సిటీకి ‘మెట్రో’ అడుగులు పడనున్నాయి. రెండో దశ ప్రాజెక్టుతో నగరం నలువైపులా సేవలు విస్తరించనున్నాయి. ప్రస్తుతం నాగోల్ నుంచి రాయదుర్గం, ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు మూడు కారిడార్‌లలో మెట్రో రైళ్ల రాకపోకలు సాగిస్తున్న సంగతి తెలిసిందే. రెండో దశలో కొత్తగా మరో ఆరు మార్గాల్లో మెట్రో విస్తరించనున్నారు. నగరంలోని ఎక్కడి నుంచైనా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకొనేవిధంగా ఎయిర్‌పోర్టు మెట్రో నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఫోర్త్‌సిటీకి సైతం ఈ రెండో దశలోనే మెట్రో నిర్మాణం చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన తరువాత అనేక రకాల ఆకర్షణీయమైన ఫీచర్‌లతో ఫ్యూచర్‌సిటీ మెట్రో డీపీఆర్‌ను తయారు చేయనున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మరోవైపు ఇటు మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు, అటు ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు, కొత్తగా పడమటి వైపు కోకాపేట్ నియోపోలిస్ వరకు మెట్రో విస్తరించనున్న దృష్ట్యా కొంతకాలంగా స్తబ్ధుగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకొనే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఫోర్త్‌సిటీకి కూడా మెట్రో పరుగులు పెట్టే అవకాశం ఉన్న దృష్ట్యా దక్షిణ హైదరాబాద్ అభివృద్ధి చెందనుంది. ఇప్పటికే ఔటర్ రింగ్‌రోడ్డు వరకు జీహెచ్‌ఎంసీ పరిధిని విస్తరించిన సంగతి తెలిసిందే. మరోవైపు హెచ్‌ఎండీఏ పరిధిని కూడా ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ వరకు పొడిగించింది. దీంతో ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు పెద్ద ఎత్తున టౌన్‌షిప్‌లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు ప్రజారవాణా, మౌలిక సదుపాయాలు సైతం విస్తరించనున్నాయి.

పెరిగిన రూట్...

రెండో దశ మెట్రో ప్రాజెక్టును మొదట 72 కిలోమీటర్ల వరకు నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందించారు. కానీ రెండు, మూడు దఫాలుగా ప్రాజెక్టును వివిధ మార్గాల్లో పొడిగించారు. దీంతో ప్రస్తుతం ఇది 116.2 కిలోమీటర్లతో అతి పెద్ద ప్రాజెక్టుగా అవతరించింది. గతంలో మైలార్‌దేవ్‌పల్లి నుంచి పీ–7 రోడ్డు మార్గంలో ఎయిర్‌పోర్టు వరకు ప్రతిపాదించిన రూట్‌ను తాజాగా మార్చారు. ఆరాంఘర్ నుంచి కొత్త హైకోర్టు మీదుగా మళ్లించారు. అలాగే రాయదుర్గం నుంచి అమెరికన్ కాన్సులేట్ వరకు మొదట ప్రతిపాదించిన రూట్‌ను సైతం ఇప్పుడు కోకాపేట్ నియోపోలిస్ వరకు పొడిగించడంతో రెండో దశ రూట్ కిలోమీటర్లు పెరిగాయి. కొత్తగా ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్‌సిటీ వరకు 40 కిలోమీటర్‌ల మార్గాన్ని కూడా ఈ రెండో దశలోనే ప్రతిపాదించడం గమనార్హం. అలాగే ఓల్డ్‌సిటీ రూట్‌లో మొదట ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ప్రతిపాదించగా దాన్ని ప్రస్తుతంచాంద్రాయణగుట్ట వరకు పొడిగించారు. ఇలా అన్ని వైపులా అదనంగా పొడిగించడంతో రెండో దశ పరిధి బాగా విస్తరించింది.

100కు పైగా స్టేషన్లు

రెండో దశ ప్రాజెక్టులో కొత్తగా 100కు పైగా మెట్రో స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. చాంద్రాయణగుట్ట వద్ద భారీ ఇంటర్‌ఛేంజ్ స్టేషన్‌ను నిర్మిస్తారు. వివిధ మార్గాల్లో వచ్చే రైళ్లు ఈ స్టేషన్ నుంచి మారే అవకాశం ఉంది. ప్రతి కిలోమీటర్‌కు, లేదా 1.5 కిలోమీటర్లకు ఒకటి చొప్పున అందుబాటులో ఉండేవిధంగా అన్ని రూట్‌లలో పెద్ద సంఖ్యలో స్టేషన్లను నిర్మిస్తారు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ రూపొందిస్తున్న కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లానింగ్ ప్రకారం స్టేషన్‌లను ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పుడున్న మూడు కారిడార్‌ల నుంచి కూడా ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు, ఫోర్త్‌సిటీ, పటాన్‌చెరు, హయత్‌నగర్ తదితర అన్ని వైపులకు ప్రయాణించేవిధంగా మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు ఎయిర్‌పోర్టు వద్ద కొత్తగా ప్రతిపాదించిన 1.6 కిలోమీటర్ల భూగర్భ మెట్రో మార్గంలోనే మెట్రో స్టేషన్ కూడా రానుండడం మరో ప్రత్యేకత.



సమావేశంలో మాట్లాడుతున్న పాపయ్యగౌడ్

రుణమాఫీలో ప్రభుత్వం విఫలం

- పక్కదోవ పట్టించేందుకే హైడ్రా డ్రామా
- కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం: రుణమాఫీ అంశాన్ని పక్కదోవ పట్టించేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా డ్రామాను తెరపైకి తీసుకొచ్చారని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గసభ్యుడు బస్వ పాపయ్యగౌడ్ ఆరోపించారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తుక్కుగూడ బహిరంగసభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించి.. పది నెలలు గడిచినా పూర్తి స్థాయిలో అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో 62 లక్షల మంది అర్హులు ఉండగా కేవలం 18 లక్షల మందికే మాఫీ జరిగిందన్నారు. కుటుంబ నిర్ధారణ, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఉద్యోగులంటూ కుంటిసాకులు చెబుతూ వ్యవసాయ కార్యాలయాల చుట్టూ రైతులను తిప్పడం ప్రభుత్వ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు పరిచిన దాఖలాలు లేవన్నారు. రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేసే వరకు కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఇందులో భాగంగా నగరంలోని ఇందిరా పార్కు వద్ద సోమవారం ఉదయం 11 నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకు రైతు దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. 24 గంటల దీక్షకు పెద్ద సంఖ్యలో రైతులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ.. నిర్వాసితులు, పేదలకు ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో కూల్చివేతలు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలకు అనుమతులిచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, మెదక్ జిల్లా ఇన్‌చార్జి తుమ్మెటి వెంకటరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి దొండ రమణారెడ్డి, మాజీ కౌన్సిలర్ టేకుల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలి



సీతారాం సంతాప సభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

మాడ్గుల: రాజకీయంగా ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా దేశ ప్రయోజనాలే మిన్నగా బతికిన వ్యక్తి సీతారాం ఏచూరి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. మండల కేంద్రంలోని వాసవి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఎన్డీయేకు వ్యతిరేకంగా ఏర్పడిన ఇండియా కూటమిని ఐక్యంగా ఉంచి, బలంగా ముందుకు తీసుకెళ్లడంలో తెరవెనుక ఏచూరి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. వామపక్ష ఉద్యమానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. మెరుగైన, సామ్యవాద భారతదేశం ఏచూరి ఆలోచన అని అన్నారు. ఆయన ఆలోచన నెరవేర్చే దిశగా అందరం కలిసి పని చేయాలని, అదే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ పులికంటి రమేష్, నాయకులు పాండు, శ్రీను, జగన్, అంజయ్య, నర్సింహ, నబి, సైదులు పాల్గొన్నారు.

‘లోపలి వాన’ పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి కె.వంశీధర్ రచించిన ‘లోపలి వాన’ పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య ఎన్.గోపి మాట్లాడుతూ..మనిషి అంతర్ముఖంలోని జడివాన వంటి అంశాలపై రచయిత రాసిన తీరు బాగుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓయూ తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు, ఆచార్య సూర్యధనుంజయ్, సికింద్రాబాద్ పీజీ కళాశాల తెలుగు అధ్యాపకులు ఆదినారాయణ, కిన్నెర కార్యదర్శి రఘురామ్ పాల్గొన్నారు.

వచ్చే ఏడాది గోల్ఫ్ టోర్నమెంట్ నిర్వహిస్తాం

పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి జూపల్లి

గోల్కొండ: వచ్చే సంవత్సరం జనవరి, ఫిబ్రవరిలో గోల్ఫ్ టోర్నమెంట్ నిర్వహిస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గోల్కొండ నయాఖిల్లాలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్సులో ఆదివారం జరిగిన గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన శంకర్‌దాస్‌కు ట్రోఫీతో పాటు రూ.15 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గోల్ఫ్ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నో ప్రణాళికలు రూపొందించారన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం ఆధ్వర్యంలో వచ్చే సంవత్సరం భారీ స్థాయిలో గోల్ఫ్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. నేరుగా ప్రభుత్వమే గోల్ఫ్ కోర్సును సిద్ధం చేసేందుకు ప్రణాళికలు రూపొందించిందన్నారు. హైదరాబాద్ గోల్ఫ్ కోర్సును అంతర్జాతీయ గోల్ఫ్ కోర్సుగా తీర్చిదిద్దిన అసోసియేషన్‌ను ఆయన అభినందించారు. ఇలాంటి టోర్నమెంట్ల నిర్వహణతో తెలంగాణలో పర్యాటక రంగానికి ప్రోత్సాహం లభిస్తుందన్నారు. నాగార్జున సాగర్, బౌద్ధవనంతో పాటు ఇతర చారిత్రక నేపథ్యం కలిగిన ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. గోల్కొండ మాస్టర్ టోర్నీకి తొమ్మిది దేశాలకు చెందిన 15 మంది క్రీడాకారులు రావడం గొప్పవిషయమన్నారు. టోర్నమెంట్ రన్నరప్‌గా నిలిచిన అంగద్ చీమా ట్రోఫీతో పాటు రూ.10 లక్షల బహుమతిని సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బీవీకే రాజు, పీజీటీఐ సీఈవో ఉత్తమ్‌సింగ్, భారత్ గోల్ఫ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి మానవ్ జైని, బి.అభిషేక్ పాల్గొన్నారు.



షాబాద్ మండలం బోడంపహాడ్‌లో ఏపుగా పెరిగిన మొక్కజొన్న పంట

‘పంట’ పండినట్టే..!

- ఆశాజనకంగా పంటలు
- ఆలస్యంగానైనా కలిసి వచ్చిన వర్షాలు
- పూత, కాత దశకు చేరిన పత్తి
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు
- మద్దతు ధర పెంచాలని విజ్ఞప్తి

షాబాద్: గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. పెట్టుబడులు కూడా రాక అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఈసారి వానాకాలం పంటలన్నీ ఆశాజనకంగా ఉండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీజన్ ప్రారంభం నుంచి కురిసిన వర్షాలకు తోడు ఇటీవల భారీ వర్షాలకు చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. చెరువుల ఆయకట్టు కింద పూర్తిస్థాయిలో పంటల సాగు చేపట్టారు.

ధరపైనే ఆశలన్నీ..

పత్తి పంట సాగుచేస్తున్న రైతులంతా మార్కెట్ ధరపైనే ఆశలు పెట్టుకున్నారు. మరో రెండు నెలల్లో దిగుబడి మొదలు కానుంది. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచడంతో మార్కెట్ ధరపైనే ఆశలు పెట్టుకున్నారు. రెండేళ్ల క్రితం గరిష్టంగా క్వింటాల్‌కు రూ.8 వేల వరకు ధర పలికింది. గతేడాది రూ.7 వేలకు మించలేదు. సగటు దిగుబడి ఎకరాకు 8 క్వింటాళ్లు ఉండగా గత సంవత్సరం ఐదు క్వింటాళ్లకు మించలేదు. దిగుబడికి తగిన ధర ఉంటే నష్టాలు పూడ్చుకోవచ్చని రైతులు ఆశిస్తున్నారు.

పెరిగిన వరి సాగు

జిల్లాలో గతేడాది 87,000 ఎకరాల్లో వరి సాగుచేయగా, ఈసారి 1,07,703 ఎకరాల్లో సాగైంది. 20,703 ఎకరాల్లో విస్తీర్ణం పెరిగింది. గతేడాది పూర్తి స్థాయిలో వర్షాలు లేక చెరువులు, కుంటల కింద వరి సాగు చేపట్టలేకపోయారు. ప్రస్తుతం అధిక వర్షాలతో చెరువులు, కుంటలు పూర్తిగా నిండాయి. ఆయకట్టు రైతులు ఉత్సాహంగా వరిసాగు చేపట్టారు. చెరువులు, కుంటల కింద ఆలస్యంగా వరి నాట్లు వేయగా బోర్లు, మోటార్ల ద్వారా చేపట్టిన పంటలు పొట్ట దశకు చేరుకున్నాయి. మరో రెండు నెలల్లో ధాన్యం దిగుబడి రానుంది.

91,223 ఎకరాల్లో పత్తి సాగు


ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 91,223 ఎకరాల్లో పత్తి పంట సాగైనట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పంట సాగుచేసి వంద రోజులుపైగా దాటుతుండటంతో ప్రస్తుతం పూత, కాత దశలో ఉంది. ఈ వానాకాలం ప్రారంభ సమయంలో వర్షాలు సమృద్ధిగా కురవకపోయినా గడిచిన రెండు నెలలుగా అనుకూలంగా వర్షాలు పడటంతో మొక్కలు ఏపుగా పెరిగాయి. సీజన్ మధ్యలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు భూమిలో తేమశాతం పెరిగి కొన్ని ప్రాంతాల్లో మొక్కల ఎదుగుదలపై ప్రభావం చూపింది. వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టగానే పచ్చదోమ తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలు కాపాడుకుంటున్నారు.

మద్దతు ధర పెంచాలి



నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసాయి. పత్తి పంటకు వాతావరణం అనుకూలంగా ఉంది. పంట ఉత్పత్తులకు తక్కువ ధర ఉంది. మద్దతు ధర పెంచితే లాభం చేకూరుతుంది.

– రాపోల్ బాల్‌రాజ్, రైతు, మల్లారెడ్డిగూడ



షాబాద్ మండలం దేవునిగడ్డలో ఏపుగా పెరిగిన పత్తి పంట

ఆ ఇళ్లు మాకొద్దు!



అసంపూర్తిగా బండరావిరాలలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్‌లు
- నగరం చుట్టూ కేటాయిస్తున్న అధికారులు
- వసతులు లేని ఇళ్లలో ఉండలేమంటున్న బాధితులు
- తీసుకునేందుకు నిరాకరిస్తున్న వైనం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మూసీ నిర్వాసితులకు ‘డబుల్’ టెన్షన్ పట్టుకుంది. అధికారులు ఇప్పటికే సర్వే పేరుతో క్షేత్రస్థాయిలో పర్యటిస్తుండటం.. నదీగర్భం సహా బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలసిన అక్రమ నిర్మాణాలను గుర్తించి, వాటికి రెడ్ మార్క్ వేస్తూ ఇళ్లను ఉన్నఫళంగా ఖాళీ చేసి వెళ్లాల్సిందిగా హుకుం జారీ చేస్తుండటం.. బాధితులకు అసంపూర్తిగా మిగిలిన ఇళ్లను కేటాయిస్తుండటంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే లాటరీ ద్వారా డబుల్ బెడ్ రూమ్‌లను పొందిన నిరుపేద లబ్ధిదారులు మౌలిక సదుపాయాల లేమితో అక్కడ ఉండలేక ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఒక్కో బ్లాకులో పది పదిహేను మందికి మించి ఉండటం లేదు. తట్టి అన్నారం, వనస్థలిపురం, కుర్మల్‌గూడలో ఇదే పరిస్థితి. తాజాగా మూసీ నిర్వాసితులకు ఈ ఇళ్లను కేటాయిస్తుండటంతో తీసుకునేందుకు వారు నిరాకరిస్తున్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేని చోట, ఊరికి దూరంగా ఎలా ఉండగలమని ప్రశ్నిస్తున్నారు. ఉన్న ఇళ్లను ఖాళీ చేసే ప్రసక్తే లేదని తెల్చి చెబుతున్నారు.

నిరాకరిస్తున్న నిర్వాసితులు

నగరంలో 55 కిలోమీటర్ల పొడవున విస్తరించిన మూసీ పరీవాహక ప్రాంతంలో 12 వేలకుపైగా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో నదీగర్భంలో హైదరాబాద్ జిల్లా పరిధిలో 1,595, రంగారెడ్డిలో 332, మేడ్చల్ పరిధిలో 239 నిర్మాణాలు ఉన్నట్లు తేల్చారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కూడిన బృందాలు రెండు రోజులుగా మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించి, ఆయా నిర్మాణాలకు రెడ్‌మార్క్ వేస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ నివాసం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదని పేర్కొంటూ నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. నిర్వాసితులకు ఓఆర్ఆర్‌కు అటు ఇటుగా ఉన్న 15 వేలకుపైగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో సుమారు లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించి కొన్నిచోట్ల పూర్తి చేసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కోర్‌సిటీలో ఉన్న పలు ఇళ్లను పేదలకు పంపిణీ చేసింది. మెజార్టీ బ్లాకులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. స్టీలు, సిమెంట్, కూలీ ధరలు పెరగడంతో టెండర్ దక్కించుకున్న నిర్మాణ సంస్థలు చేతులెత్తేశాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వీటికి అవసరమైన నిధులు కేటాయించక పోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

అసంపూర్తిగా భవనాలు

బండరావిరాలలో పది బ్లాకులు నిర్మించారు. స్లాబు, బ్రిక్ వర్క్ మాత్రమే పూర్తయింది. గదులకు డోర్లు బిగించ లేదు. తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు స్లాబు నుంచి నీరు లీకవుతోంది. నిర్మాణాల చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. డ్రైనేజీ, కరెంట్, తాగునీరు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. ఇక బాచారంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు దాదాపు పూర్తి కావొచ్చాయి. రంగులు కూడా వేశారు. డోర్లు, కిటికీలు బిగించారు. విద్యుత్ లైటింగ్, ప్లంబింగ్ వర్క్స్ పూర్తి చేయాల్సి ఉంది. వనస్థలిపురం, తట్టి అన్నారంలో నిర్మించిన ఇళ్లలో ఇప్పటికే సగానికిపైగా పంపిణీ చేసినప్పటికీ మౌలిక సదుపాయాలు లేక మెజార్టీ లబ్ధిదారులు ఖాళీ చేసివెళ్లారు. లిఫ్టులు లేకపోవడంతో పై అంతస్తుల్లోకి చేరుకునేందుకు వృద్ధులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇక బాటసింగారంలో స్లాబ్ వర్క్ మాత్రమే పూర్తి చేశారు. గోడలు, ప్లాస్టింగ్ వర్క్ పూర్తి కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు స్లాబు నుంచి నీరు లీకవుతోంది. నిర్మాణాల చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. డ్రైనేజీ, కరెంట్, తాగునీరు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు లేకపోవడం ఇబ్బందిగా మారింది. వీటిని మూసీ నిర్వాసితులకు కేటాయించనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. కనీస వసతులు కూడా లేని వీటిని తీసుకునేందుకు నిర్వాసితులు వెనుకాడుతున్నారు. నందనవనంలో నిర్మించిన ఇళ్లలో ఆక్రమణదారులు తిష్టవేశారు. వీరిని ఖాళీ చేయించి, అర్హులకు కేటాయించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. మూసీ నిర్వాసితులకు ఇక్కడ ఇళ్లు కేటాయిస్తే.. ఆక్రమణదారుల నుంచి చుక్కెదురు కానుంది.



ఉత్సాహంగా పింక్ రన్



రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన పింక్ పవర్ రన్‌కు విశేష ఆదరణ లభించింది. ఎంఈఐఎల్, సుధారెడ్డి ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. పది, ఐదు, మూడు కిలోమీటర్ల కేటగిరీల్లో మారథాన్లను నిర్వహించారు. గచ్చిబౌలిలో ప్రారంభమైన మారథాన్లు ఐఎస్‌బీ, విప్రో కూడలి మీదుగా తిరిగి స్టేడియానికి చేరుకున్నాయి. పురుషుల విభాగంలో విజేతగా లవ్ ప్రీత్ నిలిచారు. మహిళల విభాగంలో సీమా, సంజీవని ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నారు. పింక్ రన్‌లో పాల్గొన్న వేలాది మంది ప్రత్యేకమైన గులాబీ రంగు దుస్తులను ధరించి పక్షి రూపంలో భారీ మానవ హారంగా ఏర్పడి గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ప్రయత్నం చేశారు.

– సాక్షి, సిటీబ్యూరో

నిద్రలోనే అనంత లోకాలకు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


శ్రీను మృతదేహం

షాద్‌నగర్‌రూరల్‌: కుటుంబ సభ్యులతో అప్పటివరకు సంతోషంగా గడిపాడు. దావత్‌ ముగించుకొని నగరానికి పయనమయ్యాడు. అర్ధరాత్రి కావడంతో టోల్‌గేట్‌ వద్ద నిద్రకు ఉపక్రమించాడు. అదే అతడి పాలిట యమపాశమైంది. నిద్రిస్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటన ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని రాయికల్‌ టోల్‌గేట్‌ వద్ద శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రాంచందర్‌ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్‌ జిల్లా బిజినేపల్లి మండలం మంగనూరు గ్రామానికి చెందిన గోపాసు శ్రీను(36) హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో సెంట్రింగ్‌ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల తన సోదరుడు రవికి కుమారుడు పుట్టగా చూసేందుకు రెండు రోజుల క్రితం హైదరాబాద్‌ నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్లాడు. శనివారం నగరానికి తిరుగు ప్రయాణమయ్యాడు. చీకటి కావడంతో కొద్దిసేపు పడుకొని వెళ్దామని శ్రీను తన బైక్‌ను రాయికల్‌ సమీపంలోని టోల్‌గేట్‌ వద్ద పార్కుచేసి అక్కడే నిద్రకు ఉపక్రమించాడు. గుర్తు తెలియని వాహనం ఆయనను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం గమనించిన టోల్‌ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. విషయాన్ని తెలుసుకున్న ఏఎస్‌ఐ రాంచందర్‌ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పోలీసుల అదుపులో విగ్రహాల చోరీ నిందితుడు

ఇబ్రహీంపట్నం: పంచలోహ విగ్రహాల చోరీకి పాల్పడిన నిందితుడిని ఆదివారం ఇబ్రహీంపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఏసీపీ కేపీవీ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలిమినేడు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలోని శ్రీసీతారామ ఆంజనేయ పంచలోహ విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లిన సంగతి తెలిసిందే. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా ఈ చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. కాగా మతిస్థిమితంలేని వ్యక్తి ఈ చోరీకి పాల్పడినట్లు తెలుస్తుంది. విగ్రహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

మంత్రి ఉత్తమ్‌కు పరామర్శ


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌

షాద్‌నగర్‌రూరల్‌: రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి ఆదివారం మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌ ఉత్తమ్‌ ఇంటికి చేరుకొని పురుషోత్తంరెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి ఉత్తమ్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్త పరిచారు.

నకిలీ పత్రాలతో రూ.కోట్ల భూమికి ఎసరు

- కోర్టు, అధికారుల దర్యాప్తులో ముఠా గుట్టురట్టు
- ఇద్దరి అరెస్టు, పరారీలో ముగ్గురు

మహేశ్వరం: రూ.కోట్ల విలువ చేసే పట్టా భూమికి నకిలీ డాక్యుమెంట్స్‌ సృష్టించి కోర్టు, రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించిన ముఠాను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండల పరిధిలోని నాగారం గ్రామంలో 181, 182 సర్వే నంబర్లలో మహ్మద్‌ అజీఖాన్‌, ఉన్నీసాబేగం, మున్వర్‌ఖాన్‌లకు 51.22 ఎకరాల పట్టా భూమి ఉంది. ఇటీవల ఆ భూమిని మాణిక్యమ్మగూడ గ్రామానికి చెందిన మాసారం చంద్రయ్యగౌడ్‌, వారి భాగస్వాములు కలిసి కొనుగోలు చేశారు. ఈ విలువైన భూమిపై చంద్రాయన్‌గుట్టకు చెందిన సాహెబ్‌జాద ఖుర్షీద్‌ అలీఖాన్‌, కందుకూరు మండలం మహ్మద్‌నగర్‌కు చెందిన మహ్మద్‌ ఆసిఫ్‌ జానీ, చార్మినార్‌కు చెందిన మహ్మద్‌ హసన్‌, పాతబస్తీకి చెందిన అబ్బాస్‌, అలీమ్‌లు కన్నేశారు. ఈ భూమికి సంబంధించిన ఫోర్జరీ డాక్యుమెంట్స్‌ సృష్టించారు. హైదరాబాద్‌లోని శాస్త్రీపురంలో 1976లో 63 గజాల ఇంటి స్థలం రిజిస్ట్రేషన్‌ డాక్యుమెంట్‌ నంబర్‌పైన నాగారంలో ఉన్న 51.22 ఎకరాల భూమిని రిజిస్టేషన్‌ చేసుకున్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించారు. సంబంధిత పత్రాలతో కోర్టులో పిటిషన్‌ వేశారు. భూమికి సంబంధించిన డాక్యుమెంట్‌ పత్రాలను నిర్ధారించాల్సిందిగా కోర్టు జిల్లా కలెక్టర్‌ను కోరింది. మహేశ్వరం తహసీల్దార్‌ను విచారణ చేపట్టి అసలు పట్టాదారు చంద్రయ్యగౌడ్‌ అని తేర్చారు. ఈ వ్యవహారంపై భూయజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహ్మద్‌ ఆసిఫ్‌ జానీ, మహ్మద్‌ హసన్‌లను అరెస్టు చేసి శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. మిగతా ముగ్గురు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లతో ముజ్రా పార్టీ


పోలీసులకు చిక్కిన యువకులు, ట్రాన్స్‌జెండర్లు

చాంద్రాయణగుట్ట: బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ట్రాన్స్‌జెండర్లతో కలిసి అర్ధనగ్న ప్రదర్శనలతో ముజ్రా పార్టీ నిర్వహిస్తున్న సెంటర్‌పై దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. మొత్తం 8 మంది యువకులతో పాటు నలుగురు ట్రాన్స్‌జెండర్లను అరెస్ట్‌ చేశారు. టాస్క్‌ఫోర్స్‌ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావు కథనం మేరకు.. బండ్లగూడకు చెందిన హమీద్‌ శనివారం రాత్రి స్థానిక యువకులు, ట్రాన్స్‌జెండర్లతో కలిసి గౌస్‌నగర్‌ ఉందాసాగర్‌ చెరువు పక్కన లేక్‌ వ్యూ హిల్స్‌లోని ఓ ప్రహరీలో గుట్టు చప్పుడు కాకుండా ముజ్రా పార్టీని ఏర్పాటు చేశాడు. అదే ప్రాంతానికి చెందిన మహ్మద్‌ జాబ్రీ, మహ్మద్‌ రియాజ్‌, షేక్‌ సొహేల్‌, షానవాజ్‌ ఖాన్‌, మహ్మద్‌ ఇమ్రాన్‌, మహ్మద్‌ ఫెరోజ్‌, సయ్యద్‌ షా ఫారూఖ్‌, షేక్‌ మహ్మద్‌లు ట్రాన్స్‌జెండర్లు మైలార్‌దేవ్‌పల్లికి చెందిన సొహేల్‌ అలియాస్‌ ఆర్జూ, పురానాపూల్‌కు చెందిన మహ్మద్‌ సైఫ్‌ అలియాస్‌ లవ్లీ, జల్‌పల్లికి చెందిన కరీమా బక్ష, వట్టేపల్లికి చెందిన అబ్దుల్‌ ఆమెర్‌లతో అర్ధనగ్నంగా డ్యాన్స్‌లు చేయిస్తూ భారీ శబ్దాలతో స్థానికంగా న్యూసెన్స్‌కు పాల్పడ్డారు. సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎస్‌.రాఘవేంద్ర, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్‌ కె. సత్యనారాయణ, ఎస్సైలు నవీన్‌, నర్సింహులు దాడులు నిర్వహించి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడు పరారీలో ఉన్నాడు.


మైసిగండి శివ రామాలయాలు


జలకళతో కోనేరు

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం

- మైసిగండిలో వచ్చే నెల 3 నుంచి వేడుకలు
- ముమ్మరంగా ఏర్పాట్లు

కడ్తాల్‌: ప్రకృతి రమణీయ క్షేత్రం, భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్న దక్షిణ తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచిన మైసిగండి మైసమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. స్థానికంగా శివాలయ, రామాలయ దేవస్థానంలో కొలువైయున్న శ్రీ అన్నపూర్ణేశ్వరి, మహాలక్ష్మి జ్ఞాన సరస్వతిదేవీల శరన్నవరాత్రి ఉత్సవాలు అక్టోబర్‌ 3న ప్రారంభమై 12వ తేదీ విజయదశమి వరకు వైభవంగా జరగనున్నాయి. వాటికి సంబంధించి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు ఏటా జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్‌, నల్గొండ, మెదక్‌, నాగర్‌కర్నూల్‌, వనపర్తి, మహబూబ్‌నగర్‌, వికారాబాద్‌, మేడ్చల్‌ తదితర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మైసిగండి మైసమ్మ దేవతను దర్శించుకుంటారు. ఇక్కడికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో స్నేహలత, ఆలయ ఫౌండర్‌ ట్రస్టీ శిరోలీ పంతునాయక్‌ తెలిపారు. ఆలయాలను రంగులు, విద్యుద్దీపాలు, పచ్చటి తోరణాలతో శోభాయామానంగా తీర్చిదిద్దుతున్నారు. సర్వాంగ సుందరంగా చేసిన అలంకరణ ఆకట్టుకుంటుంది.


అన్నపూర్ణేశ్వరిదేవి


మైసిగండి మైసమ్మ తల్లి

అమ్మవారి అలంకరణలు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నపూర్ణేశ్వరి దేవి వివిధ రూపాలలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అక్టోబర్‌ 3న గురువారం అన్నపూర్ణదేవి అలంకారం, 4న బాలా త్రిపుర సుందరిదేవి, 5న గాయత్రీ దేవి, 6న భవానీదేవి, 7న లలితా త్రిపుర సుందరిదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతిదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్దిని, 12న శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం ఉత్సవాలు ముగుస్తాయని, ఈ సందర్భంగా ప్రతి రోజు ఆలయంలో చండీహోమం నిర్వహించనున్నట్లు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

రవాణా సదుపాయం

హైదరాబాద్‌ నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో మైసిగండి మైసమ్మ ఆలయం ఉంది. ఇది నగరం నుంచి 48 కిలోమీటర్ల దూరంలో ఉంది. హైదరాబాద్‌ ఇమ్లీబన్‌ బస్టాండ్‌ నుంచి ప్లాట్‌ ఫాం 29, 30, 31 నుంచి ప్రతి ఐదు నిమిషాలకు బస్సు సౌకర్యం కలదు. అదే విధంగా నల్గొండ ఎక్స్‌ రోడ్‌, ఐ.ఎస్‌.సదన్‌, సంతోష్‌నగర్‌, చంద్రాయన్‌గుట్ట నుంచి బస్సులున్నాయి. కల్వకుర్తి, నాగర్‌ కర్నూల్‌, అచ్చంపేట్‌ నుంచి బస్సు సౌకర్యం కలదు.

వైద్యానికి తీసుకెళ్తుండగా..

బైక్‌ ఢీకొని పసికందు మృతి


మహేందర్‌ (ఫైల్‌)

కేశంపేట: కన్నవారి ప్రేమను ఆస్వాదిస్తూ రెండు నెలలు పూర్తవ్వక ముందే విధి ఆ పసికందుపై కన్నెర్రజేసింది. అనారోగ్యానికి గురైన తమ కుమారుడిని వైద్యానికి తీసుకెళ్తుండగా రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆ బాలుడు మృతి చెంది తల్లిదండ్రులకు తీరని వేదన మిగిలించాడు. ఈ విషాద సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పుట్టోనిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కాంకిరాళ్లతండాకు చెందిన రమేశ్‌ తన భార్య పద్మతో కలిసి 45 రోజుల కుమారుడైన మహేందర్‌ని డాక్టర్‌ను సంప్రదించేందుకు నిర్దవెల్లి గ్రామానికి బైక్‌పై శనివారం రాత్రి బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యలో బోధునంపల్లి గ్రామ గేట్‌ సమీపంలో కేశంపేట గ్రామానికి చెందిన యాదయ్య తన బైక్‌ పైన గ్రామానికి వస్తుండగా ఇరు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పసికందుతో సహా మొత్తం నలుగురికి గాయలయ్యాయి. వీరిలో యాదయ్యను షాద్‌నగర్‌కు, పద్మ, రమేశ్‌తో పాటు బాలుడిని శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మహేందర్‌ను మెరుగైన చికిత్స కోసం నిలోఫర్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. యాదయ్య బైక్‌ను అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం జరిగిందని మృతుడి తాత నరసింహ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్‌ తెలిపారు.

ప్రేమతో వైద్యం చేయాలి

సినీనటుడు బ్రహ్మానందం

బంజారాహిల్స్‌: మనిషిని భయం కృంగదీస్తుందని, అలాంటి సమయంలోనే వైద్యులు ప్రేమతో రోగికి ధైర్యం చెప్పి వైద్యం చేస్తే మంచి ఫలితాలు వస్తాయని సినీ నటుడు పద్మశ్రీ బ్రహ్మానందం అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో స్టార్‌ ఆస్పత్రి ఆధ్వర్యంలో వరల్డ్‌ హార్ట్‌ డే సందర్భంగా హార్ట్‌ టూ హార్ట్‌ పేరుతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మానందం తన జీవితంలో తన కుటుంబం విషయంలో ఎదురైన ఆరోగ్య అనుభవాలను, డాక్టర్లతో జరిగిన అనుభవాలను పంచుకున్నారు. తాను కూడా బైపాస్‌ సర్జరీ చేసుకున్నానని కానీ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. జబ్బు రాక ముందే జాగ్రత్తగా పడాలని ఒక వేళ వస్తే దానిని అధిగమించే మార్గాలను అన్వేషించాలన్నారు. కార్యక్రమంలో స్టార్‌ హాస్పిటల్స్‌ గ్రూప్‌ ఎండీ డాక్టర్‌ మన్నెం గోపీచంద్‌, సంస్థ జేఎండీ డాక్టర్‌ రమేష్‌ గూడపాటి తదితరులు పాల్గొన్నారు.

మట్టి దిబ్బలు పడి యువకుడి దుర్మరణం

మూసాపేట: కేబుల్‌ వైరింగ్‌ కోసం తీసిన గుంతలో పని చేస్తుండగా మట్టి మీద పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కూకట్‌పల్లి లోని రంగనాయక స్వామి ఆలయ సమీపంలో హానర్‌ సంస్థ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. బీహార్‌కు చెందిన రవి (20) తండ్రి కిషోర్‌ రామ్‌తో కలిసి కూలీ పనులు చేస్తున్నాడు. కేబుల్‌ వైరింగ్‌ కోసం తీసిన గుంతలో వైర్ల సమస్య ఉండటంతో రవి గుంతలోకి దిగి వాటిని మరమ్మతు చేస్తుండగా ఒక్కసారిగా మట్టి కుప్పకూలి అతడిపై పడింది. దీంతో అక్కడే ఉన్న తోటి కార్మికులు అతడిని బయటికి తీసి సమీపంలోని అమోర్‌ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి కిషోర్‌ రామ్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దారుణ హత్య

చిక్కడపల్లి: స్నేహితుడిని ఓ వ్యక్తి గొంతుకోసి హత్యచేసిన సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం... లోయర్‌ ట్యాంక్‌బండ్‌ గోశాల వెనక గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైనట్టు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడిని భరత్‌ నగర్‌కు చెందిన మహ్మద్‌ బషీర్‌(30)గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కూలీగా పనిచేస్తున్న బషీర్‌ కుటుంబ సభ్యులు కొంతకాలం క్రితంతుముకుంట కొకూర్‌కు మకాం మార్చారు. అయితే ఉంటున్న బషీర్‌, తన స్నేహితుడు భోలక్‌పూర్‌కు చెందిన ఫైయిమొద్దీన్‌తో కలిసి ఇక్కడే ఉంటున్నాడు. శనివారం రాత్రి ఇద్దరూ కలిసి మద్యం తాగిన అనంతరం గోశాల ప్రాంతానికి వచ్చారు. వారి మద్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఫైయిన్‌ బషీర్‌ను చాకుతో గొంతు కోసి హత్య చేసి అక్కడినుంచి పరారయ్యాడు. సెంట్రల్‌ జోన్‌ డీసీపీ అక్షాన్స్‌యాదవ్‌, దోమలగూడ ఏసీపీ మొగలయ్య, క్లూస్‌ టీమ్‌ సిబ్బంది ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

కాలేజీ బస్సు ఢీకొని.. వ్యక్తి మృతి


ఉమేష్‌ మృతదేహం

చాదర్‌ఘాట్‌: రాంగ్‌రూట్‌లో వచ్చిన నర్సింగ్‌ కాలేజీ బస్సు ఢీ కొని బైక్‌పై వెళుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన చాదర్‌ఘాట్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. డబీర్‌పురా కోమటివాడకు చెందిన దాసకొండ ఉమేష్‌ (35) వ్యాపారం చేసేవాడు. ఆదివారం ఉదయం తను దిల్‌సుఖ్‌నగర్‌ నుంచి చాదర్‌ఘాట్‌ వెళుతుండగా రాంగ్‌ రూట్‌లో వచ్చి యశోదా నర్సింగ్‌ స్కూల్‌ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఉమేష్‌ అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దివ్యాంగులపై దాడులు అనాగరికం

వీహెచ్‌పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య


మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు తదితరులు

కందుకూరు: దివ్యాంగులపై దాడులు చేస్తే సహించేదిలేదని వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్‌) రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య హెచ్చరించారు. దివ్యాంగుడిపై దాడి ఘటనలో చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం కందుకూరు పీఎస్‌లో బేగంపేటకు చెందిన ఆర్టీసీ కండక్టర్‌పై వీహెచ్‌పీఎస్‌ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులతో కలిసి మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. నల్గొండ జిల్లా మర్రిగూడ ఐకేపీ నర్సింహపై కండక్టర్‌ దాడి చేశాడని, ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. దివ్యాంగుల చట్టం ప్రకారం చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్‌ జిల్లా అధికార ప్రతినిధి యాచారం జంగయ్య, జిల్లా నాయకులు మద్దెల బాల్‌రాజ్‌, గువ్వల యాదయ్య, పగడాల రాజు, నర్సింహ పాల్గొన్నారు.

బ్లూబగ్‌ మాయ!

- బ్లూ టూత్‌తో స్మార్ట్‌ఫోన్ల హ్యాకింగ్‌
- మాల్‌వేర్స్‌తో సెల్‌ఫోన్‌లోని డేటా తస్కరణ
- వీటి సహాయంతో సైబర్‌ నేరాలు
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

సాక్షి, సిటీబ్యూరో: సైబర్‌ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త దారులు వెతుకుతున్నారు. బ్లూటూత్‌ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో దీన్నే అస్త్రంగా మలుచుకుంటున్నారు. బ్లూ బగ్గింగ్‌ పేరుతో కొత్త తరహా హ్యాకింగ్‌లకు పాల్పడుతూ మోసాలు చేస్తున్నారు. ఢిల్లీ, ఎన్‌సీఆర్‌, ముంబై వంటి ప్రధాన నగరాల్లో బ్లూటూత్‌ బగ్గింగ్‌ సైబర్‌ నేరాలు పెరిగిపోతుండటంతో తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. అప్రమత్తంగా ఉండాలని, లేకపోతే వ్యక్తిగత డేటాను తస్కరించి బెదిరింపులకు పాల్పడటంతో పాటూ బ్యాంకు ఖాతాలు లూటీ చేస్తారని హెచ్చరిస్తున్నారు.

ఏమిటీ బ్లూ బగ్‌?

తొలుత హ్యాకర్‌ తన బ్లూ టూత్‌ పేరును ఎదుటి వ్యక్తులు వినియోగిస్తున్న ఫోన్‌, ఇతర గాడ్జెట్స్‌ కంపెనీ పేరులాగా మార్చి కనెక్ట్‌ అయ్యేందుకు బ్లూటూత్‌ రిక్వెస్ట్‌ పంపిస్తారు. అది మనదే అని పొరపాటున పెయిర్‌ యాక్సెప్ట్‌ చేస్తే ఇక అంతే... హ్యాకర్లు బ్రూట్‌ఫోర్స్‌ సాంకేతికత ద్వారా మన సెల్‌ఫోన్‌లోని లాగిన్‌ ఆధారాలు, ఎన్‌క్రిప్షన్‌ కీ, వెబ్‌పేజీలకు భంగం కలిగిస్తారు. దీంతో సెల్‌ఫోన్‌ ఆన్‌లోనే ఉంటుంది కానీ, ఎలాంటి సందేశాలు రావు. ఆ తర్వాత సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకునేందుకు మాల్‌వేర్‌ను ఇన్‌స్టాల్‌ చేస్తాడు. అంతే దీంతో మీ ఫోన్‌లోని కాంటాక్ట్‌లు, మెసేజ్‌లు, ఫొటోలు, ఆడియో, వీడియో రికార్డులు, ఈ–మెయిల్స్‌ ప్రతీ ఒక్కటీ నేరస్తుల చేతుల్లోకి వెళ్లిపోతుంది.

పెయిర్‌ చేస్తే దొరికిపోయినట్టే..

సాధారణంగా హ్యాకర్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్‌ల ద్వారా లింకులు, సాఫ్ట్‌వేర్‌లు పంపించి హ్యాక్‌ చేస్తుంటారు. బ్లూ బగ్గింగ్‌ విధానంలో మాత్రం బ్లూటూత్‌ను అనుసంధానిస్తే చాలు హ్యాకింగ్‌ చేయవచ్చు. యునీక్‌ నంబర్‌, అడ్రస్‌లతో రూపొందించిన మీడియా యాక్సెస్‌ కంట్రోల్‌ (ఎంఏసీ) బ్లూటూత్‌ నెట్‌వర్క్‌లో ఒకదానితో ఒకటి అనుసంధానించడానికి వీలు కల్పిస్తుంది. ఒకసారి పెయిర్‌ అయితే అవతలి వ్యక్తి ఎలక్ట్రానిక్‌ ఉపకరణాన్ని ట్రాక్‌ చేయడానికి వీలుంటుంది. సెల్‌ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారాన్ని నేరస్తులు తస్కరించి, వీటి సహాయంతో బెదిరింపులకు పాల్పడుతుంటారు. బలవంతపు వసూళ్లు చేస్తుంటారు.



ప్రతి ఒక్కటీ బ్లూటూత్‌తో కనెక్ట్‌..

ఈ రోజుల్లో ప్రతి ఒక్క ఎలక్ట్రానిక్‌ ఉపకరణం బ్లూటూత్‌తో అనుసంధానమై పోయింది. ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్‌, స్మార్ట్‌ఫోన్‌, స్మార్ట్‌వాచ్‌లు, ఎయిర్‌బడ్స్‌, కారులోని మ్యూజిక్‌ సిస్టమ్‌ (కార్‌ ప్యూటర్‌), ఇంటిలోని ఫ్రిడ్జ్‌, ఏసీ, టీవీ వంటి గృహోపకరణాలు సైతం బ్లూటూత్‌తో కనెక్ట్‌ అవుతున్నాయి. బ్లూటూత్‌తో అనుసంధానమైతే ఆయా ఉపకరణాలను చేతులతో కాకుండా మౌఖిక ఆదేశాలతో వినియోగించుకునే వీలుంటుంది. దీంతో వేగం, సౌలభ్యంగా ఉంటుంది. ఈ కారణంగా యువత నుంచి పెద్దల వరకు ఈ వైర్‌లెస్‌ పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఇదే అదునుగా సైబర్‌ నేరగాళ్లు బ్లూటూత్‌ అనుసంధానమై ఉన్న ఎలక్ట్రానిక్‌ ఉపకరణాలను లక్ష్యంగా చేసుకొని పంజా విసురుతున్నారు.